సాక్షి నిర్మల్

I

గురువారం। 1 । మే । 2025

నేడే మేడే





రెక్కాడితే గాని డొక్కాడని వారికి ఉపాధి కోసం నిత్య పోరాటమే. హక్కుల సాధన కోసం అనేక ఏళ్లుగా పోరాడు తూనే ఉన్నారు. నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భం గా ఆయా రంగాల్లోని కార్మికులకు సలాం.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

న్యూస్‌రీల్

మహిళల హక్కుల కోసం పోరాడిన బసవేశ్వర్



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: మహిళల హక్కుల కోసం పోరాడిన విప్లవాత్మక నాయకుడు బసవేశ్వర మహరాజ్ అని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్‌లో బుధవారం బసవేశ్వర జయంతి వేడుకలు అధికారికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బసవేశ్వర మహరాజ్ నాటి కాలంలోనే సమాజంలో అసమానతలను తొలగించి సమానత్వాన్ని నెలకొల్పేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీనివాస్, సీపీవో జీవరత్నం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలతో ఏఎస్పీ సెల్ఫీ..!



సెల్ఫీ దిగుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

కుంటాల: మహిళలు మహారాణులని, అన్నిరంగాల్లో ముందుండాలని ఏఎస్పీ అవినాష్ కుమార్ సూచించారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు నారీశక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఓలా గ్రామంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలతో కలిసి సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో భైంసా సీఐ నైలు, ఎస్సై సీ.అశోక్, ఏఎస్సై దేవన్న, వీడీసీ చైర్మన్ ఎగ్గం నర్సింలు, మాజీ కో ఆప్షన్ మెంబర్ హైమద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు విలువైనవి



ఉపాధ్యాయులతో డీఈవో రామారావు

నిర్మల్‌రూరల్ :ఉపాధ్యాయుల సేవలు విలువైనవని, వాటిని పదవీ విరమణ తర్వాత కూడా అందించాలని డీఈవో రామారావు పేర్కొన్నారు. ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందిన 11 మంది ఉపాధ్యాయులను బుధవారం డీఈవో కార్యాలయంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు కృత్రిమ మేధా సహాయంతో అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. కాలానికి అనుగుణంగా మార్పులను గ్రహించి వాటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్, ముఖ్య పర్యవేక్షకులు వెంకటరమణ, శ్రావణి, ఎస్‌వోలు రాజేశ్వర్, నరసయ్య, సలోమి కరుణ, ప్రవీణ్ కుమార్, లింబాద్రి, డీఎస్‌వో వినోద్ కుమార్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మే 10 వరకు నీటిని విడుదల చేయాలి



సీఈకి వినతిపత్రం ఇస్తున్న రితేశ్ రాథోడ్

ఖానాపూర్: సదర్మాట్ ఆయకట్టు పరిధిలోని ఖానాపూర్, కడెం మండలాల రైతులకు ఈ నెల 10 వరకు ఎస్సారెస్పీ నుంచి సాగునీటిని విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ బుధవారం సీఈ రఘునాథ్ రావును కోరారు. హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పంట చివరిదశలో ఉందని, గత నెల 29కే సదర్మాట్ కాలువకు నీటి సరఫరా నిలిపివేయడం సరికాదన్నారు. తన విన్నపానికి సీఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

హ్యాట్రిక్ మిస్...

చదువుల తల్లి జ్ఞానసరస్వతి కొలువైన జిల్లా రెండేళ్లు వరుసగా పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ఈసారీ.. హ్యాట్రిక్ సాధిస్తామని జిల్లా అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ.. తాజా ఫలితాల్లో జిల్లా మరీ దారుణంగా 15వ స్థానానికి పడిపోయింది. రెండేళ్లు ఫస్ట్ వచ్చి, ఈసారి కనీసం టాప్ టెన్‌లో కూడా లేకపోవడం గమనార్హం. విద్యాశాఖ బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో జిల్లా 96.70 శాతం ఉత్తీర్ణత సాధించింది. గతేడాది 99.5% ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలువగా, ఈసారి దాదాపు మూడుశాతం తగ్గి పద్నాలుగు స్థానాలు పడిపోయింది. బాలురకంటే బాలికలే పైచేయి సాధించారు. సర్కారు బళ్లు మంచిమార్కులతో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా నిలిచాయి. అలాగే కేజీబీవీలు అత్యుత్తమ మార్కులు, ఉత్తీర్ణత శాతంతో మరోసారి సత్తాచాటాయి.

– నిర్మల్‌రూరల్

- 'పది' ఫలితాల్లో 15వ స్థానానికి జిల్లా
- బాలికలదే పైచేయి
- ప్రైవేటుకు దీటుగా సర్కారు స్కూళ్ల ఉత్తీర్ణత
- జిల్లాలో 96.70 శాతం పాస్
- సత్తాచాటిన కేజీబీవీలు
- జూన్ 3 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు



కుభీర్ కేజీబీవీలో పదోతరగతి విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

జిల్లాకు 15వ స్థానం...

వరుసగా రెండుసార్లు టెన్త్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చిన జిల్లా 15వ స్థానంలో నిలిచింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 3 వరకు పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 7 నుంచి 15 వరకు మూల్యాంకనం చేపట్టారు. మొత్తం 9,123 మంది విద్యార్థులకు గానూ 8,822(96.70శాతం) విద్యార్థులు పాసయ్యారు. 301 మంది ఫెయిలయ్యారు. బాలురు 4,441 మందికి గానూ 4,261 (95.95శాతం), 4,682 మంది బాలికలకు గానూ 4,561 (97.42శాతం) మంది పాసయ్యారు. గతేడాది 8,908 మంది విద్యార్థులకు గాను 8,823 మంది (99.05శాతం) ఉత్తీర్ణులయ్యారు.

పడిపోయిన స్థానం....

పదోతరగతి ఫలితాల్లో జిల్లా గతేడాది కంటే ఈసారి 14 స్థానాలు పడిపోయి 15వ స్థానంలో నిలిచింది. ఉపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు కలిసి ప్రణాళిక ప్రకారం పని చేసినా.. మెరుగైన స్థానం సాధించలేకపోయారు. హ్యాట్రిక్ ఎలాగైనా సాధించాలనే తపనతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, డీఈవో రామారావు ప్రత్యేక చొరవ చూపారు. కానీ.. ఎక్కడా ఫలితాల్లో వారి శ్రమకు తగ్గ ప్రతిఫలం కనిపించలేదు. మరోవైపు 0.19శాతం మార్కుల తేడాతో జిల్లా 5స్థానాలు పడిపోవడం గమనార్హం. ఇక గతంలో రెండుసార్లు ప్రథమ స్థానం సాధించినప్పుడు డీఈవోగా పనిచేసిన రవీందర్‌రెడ్డి మహబూబాబాద్ బదిలీ అయ్యారు. ఈసారి ఆ జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలువడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సత్తా చాటిన కేజీబీవీలు

మొన్న ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన కేజీబీవీలు పదోతరగతిలోనూ ఏకంగా 98.59 శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలో మొత్తం 18 కేజీబీవీలు ఉండగా, 711 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 701మంది పాసవ్వగా, కేవలం పదిమంది మాత్రమే ఫెయిలయ్యారు. మామడ, లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, సోన్, నర్సాపూర్(జి), దస్తురాబాద్, కడెం, ఖానాపూర్, పెంబి, కుభీర్, లోకేశ్వరం, ముధోల్, తానూర్ కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. భైంసా, నిర్మల్‌రూరల్, సారంగాపూర్ కేజీబీవీలు 98 శాతం, కుంటాల 95 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

జూన్ 3 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు..

జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మే 16 లోపు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలి. రీకౌంటింగ్ కోసం రూ. 500 చొప్పున 15రోజుల్లోగా ఫీజు చెల్లించాలి. ప్రీ వెరిఫికేషన్, లేదా జవాబు పత్రాల జిరాక్స్ కోసం ఒక్కో సబ్జెక్టుకు వెయ్యి చొప్పున విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సర్కారు స్కూళ్లల్లో ఆణిముత్యాలు..

మారుమూల గ్రామాల్లో ఉంటూ సర్కారు బడుల్లో చదువుతున్న పిల్లలూ సత్తా చాటారు. కాస్తంత దృష్టిపెడితే మట్టిలో మాణిక్యాలు బయటకు వస్తాయనడానికి నిదర్శనంగా నిలిచారు. హైదరాబాద్ వంటి కార్పొరేట్ స్కూళ్లల్లో రూ.లక్షలు పెట్టి చదివించినా రాని మార్కులు ఇక్కడ ఊళ్లో, సర్కారు బడిలో చదివి సాధించిన ఆణిముత్యాలు ఉన్నారు.

- నిర్మల్ పట్టణంలోని సోఫీనగర్ బాలికల రెసిడెన్షియల్‌లో చదివిన ఏ.సాహిత్య 583 మార్కులు, ఏ.సంధ్య 578, ఏ.సాహిత 573 మార్కులు సాధించారు.
- ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి డి.నిషిత 573 మార్కులతో సర్కారు స్కూళ్లల్లో జిల్లాలో టాప్ మార్కులు సాధించింది. ఇదే బడిలో చదువుతున్న కట్కం అక్షయ 567మార్కులు సాధించింది.
- కుభీర్ కేజీబీవీలో చదివిన భైంసా మండలం మహాగాం గ్రామానికి చెందిన వి.షణ్ముఖప్రియ 569 మార్కులు సాధించి, జిల్లా కేజీబీవీలతో పాటు కుభీర్ మండల టాపర్‌గా నిలిచింది.
- మామడ కేజీబీవీ 11ఏళ్లుగా వరుసగా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ వస్తోంది. ఈ ఏడాది కూడా మొత్తం 35 మంది విద్యార్థులు పాసవ్వడంతో పాటు దిమ్మదుర్తి గ్రామానికి చెందిన హిందు 537మార్కులు సాధించడం గమనార్హం.

ప్రోత్సాహం.. ప్రిపరేషన్‌తోనే..



మాది కుభీర్ మండలం చాత గ్రామం. అమ్మ లక్ష్మి ఆశ కార్యకర్త. నాన్న విఠల్ వ్యవసాయం చేస్తుంటారు. ఐదోతరగతి నుంచి సోఫీనగర్ బాలికల రెసిడెన్షియల్‌లోనే చదువుతున్నాను. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, ప్రిపరేషన్‌తోనే పదోతరగతిలో 583 మార్కులు సాధించగలిగా.

– ఏ.సాహిత్య, సోఫీనగర్ బాలికల రెసిడెన్షియల్, నిర్మల్

ఉపాధ్యాయుల గైడ్‌లైన్స్‌తోనే..



ఖానాపూర్ పట్టణానికి చెందిన సుజాత, రాజేశ్వర్‌గౌడ్ మా అమ్మానాన్న. నాన్న బీడీ కంపెనీ నడిపిస్తారు. అమ్మ గృహిణిగా ఉన్నారు. వారి ప్రోత్సాహంతో పాటు ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయుల గైడ్‌లైన్స్‌తోనే 573మార్కులు సాధించగలిగా.

– నిషిత, ఖానాపూర్

పక్కా ప్రణాళికతో ఫలితం..



ఈసారి పదోతరగతి ఫలితాల్లో మా విద్యార్థి వి.షణ్ముఖప్రియ 569 మార్కులు సాధించింది. విద్యాసంవత్సరం ఆరంభం నుంచి సైకిల్ పార్ట్ టెస్టు(సీపీటీ)లతో పాటు దసరా సెలవుల నుంచే ప్రిపరేషన్ మొదలుపెట్టాం. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు గణితం, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను చదివించాం.

– వాణి, ఎస్‌వో, కుభీర్ కేజీబీవీ

పదకొండేళ్లుగా వందశాతం ఉత్తీర్ణత..



ప్రణాళికాబద్ధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తుండటంతో 2014నుంచి 11ఏళ్లుగా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఈసారి కూడా మొత్తం 35 మంది విద్యార్థినులు పాసయ్యారు. అందులో హిందు 537మార్కులు సాధించడం హర్షనీయం.

– జ్యోతి, ఎస్‌వో, మామడ కేజీబీవీ

వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 54 లక్షల 89 వేల ఎకరాల్లో సాగు కాగా దాదాపు కోటి 37 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి అంచనా వేశామన్నారు. ప్రభుత్వం ద్వారా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ, తూకం, శుద్ధీకరణ యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, గన్నీసంచులు సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తీసుకోవద్దని స్పష్టం చేశారు. ధాన్యం రవాణా కోసం తగినన్ని లారీలు సిద్ధంగా ఉంచాలని, కూలీల కొరత లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతీ కేంద్రంలో అవసరమైన యంత్రాలు, సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు. నిర్ణీత సమయంలో కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఏడీ మార్కెటింగ్ గజానంద్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు శుభాకాంక్షలు

పదోతరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కలెక్టర్ అభిలాష అభినవ్ శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో కలెక్టర్ స్పందిస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనుత్తీర్ణులైన విద్యార్థులు అధైర్యపడవద్దని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ విజయం వైపు ప్రయాణం కొనసాగించాలని సూచించారు.

క్రీడలు లేని ప్రాంగణాలు



కనకాపూర్ గ్రామంలో చెరువులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

- లక్ష్యానికి దూరంగా క్రీడా మైదానాలు
- పంచాయతీలకే పరిమితమైన స్పోర్ట్స్ కిట్లు
- వేసవి దష్ట్యా వినియోగంలోకి తెస్తే మేలు

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో మూడేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక్కో ప్రాంగణానికి క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కానీ వాటిని బయటకు తీసి ఆటలు ఆడిన దాఖలాలు ఎక్కడా లేవు.

2022, జూన్ 2న ప్రారంభం

జిల్లాలోని అన్ని మండలాల్లో రెండు చొప్పున క్రీడా ప్రాంగణాలను 2022 జూన్ 2న అధికారులు ప్రారంభించారు. ఆ తర్వాత మిగతా గ్రామాల్లో దశల వారీగా ఆరంభించారు. తొలుత వాలీబాల్, ఖోఖోలకు తప్ప మిగతా క్రీడలకు అవసరమయ్యే క్రీడా పరికరాలు పంపిణీ చేయలేదు. దీంతో జిల్లాలోని 582 క్రీడా ప్రాంగణాలు నామమాత్రంగా మారాయి. ప్రాంగణాలు చిన్నగా ఉండడం, క్రీడా సామగ్రి లేకపోవడంతో యువత, విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఆసక్తి చూపలేదు. ఫలితంగా సుమారు మూడేళ్లుగా వినియోగం లో లేక క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. వీటిని వినియోగంలోకి తెచ్చి క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో 2023లో గ్రామ పంచాయతీలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు.

అలంకారప్రాయంగానే..

గ్రామాల పరిధిలో అరెకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉండడంతో స్మశాన వాటికల పక్కన, పాఠశాలల ప్రాంగణాలు, ఖాళీగా ఉన్న కొద్ది పాటి స్థలాల్లో తెలంగాణ ప్రాంగణం పేరిట బోర్డు, వాలీబాల్ కోర్టు, వ్యాయామం చేసేందుకు రెండు పరికరాలు ఏర్పాటు చేసి నామ్‌కే వాస్తేగా వదిలేశారు. కొన్నిచోట్ల కేవలం క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డులు పెట్టి ఇతరత్రా వసతులను మరిచారు. ఇక పట్టణాల్లోనూ వార్డుకో క్రీడా ప్రాంగణం ఉండాల్సి ఉండగా స్థలం కొరత వల్ల మూడు మున్సిపాలిటీల పరిధిలో 23 ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి ఆధ్వానంగా మారాయి. మరోవైపు నిధుల కొరత వల్ల పంచాయతీలు వీటి నిర్వహణ చేపట్టలేక పూర్తిగా గాలికొదిలేశాయని పలువురు పేర్కొంటున్నారు.



కుంటాల మండలం ఓలా గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో ధాన్యం కొనుగోళ్లు

గతంలో పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్స్‌లోనిసామగ్రి

స్పోర్ట్స్ కిట్లలో మేజరింగ్ టేపు 1, డిస్కస్ త్రో 1, 2 కిలోలు, టెన్నికాయిట్ రింగులు 6, స్కిప్పింగ్ రోప్‌లు 4, ప్లాస్టిక్ విజిల్స్ 3, స్టాప్ అండ్ గో వాడెస్ 1, సింథటిక్ వాలీబాల్ 1, నెట్ 1, సైకిల్ పంపు, బిగ్ సైజ్ (ఫుట్ పంపు)1 ఉంటాయి. డంబెల్స్ మూడు సెట్లు, టీషర్టు 75, క్రికెట్ బ్యాట్ నెం.5, కశ్మీర్ విల్లో 1, ఫుల్సైజ్ బ్యాట్ 1, బ్యాటింగ్ గ్లౌజులు ఒకజత, లెగ్ ప్యాడ్లు రెండు జతలు, వికెట్ కీపింగ్ లెగ్ గార్డు ప్యాడ్ ఒక జత, స్టంప్స్ సెట్ 2 జతలు, లబ్డామినల్ గార్డ్స్ 2 జతలు, ప్రాక్టీస్ బాల్స్ 6, ఆర్మ్ గార్డ్స్ 2, థైప్యాడ్లు 4, క్రికెట్ కిట్ బ్యాగ్ 1 ఉన్నాయి.

జిల్లా వివరాలు	
మండలాలు :18	మున్సిపాలిటీలు : 3
మండలాల పరిధిలో క్రీడా ప్రాంగణాలు :582	
మున్సిపాలిటీల పరిధిలో క్రీడా ప్రాంగణాలు : 23	
2023లో జిల్లాకు చేరిన స్పోర్ట్స్ కిట్లు : 656	

అటకెక్కిన క్రీడా సామగ్రి

జిల్లాలోని పలు క్రీడా ప్రాంగణాలకు 2023 అక్టోబర్‌లో 605 కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో క్రీడా యూనిట్ విలువ రూ.68 వేలు ఉంటుంది. ఇందులో జిమ్ పరికరాలతో పాటు క్రికెట్, వాలీబాల్ ఆటలకు సంబంధించిన సామగ్రి ఉంది. కానీ చాలా చోట్ల వినియోగంలో లేక గ్రామ పంచాయతీ గదుల్లో మూలన పడేశారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. వాటిలో సరైన వసతులు లేకపోవడంతో ఆదరణకు నోచుకోవడం లేదు. వీటిపై పర్యవేక్షణ కొరవడటంతో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. వేసవి సెలవుల దష్ట్యా అధికారులు చొరవ తీసుకొని ప్రాంగణాలను వినియోగంలోకి తేస్తే యువతకు మేలు జరుగుతుంది.

– కుందారం శివకుమార్, న్యూ వెల్మల్

అక్షయ తృతీయ.. కొనుగోళ్లు అంతంతే

- పర్వదినాన ఆసక్తి చూపని ప్రజలు
- జిల్లాలో తగ్గిన పసిడి కొనుగోళ్లు..
- ధర పెరుగుదలతో సంప్రదాయం పక్కన పెట్టిన వినియోగదారులు

24 క్యారెట్ మేలిమి బంగారం ధరలు (10 గ్రాములకు)

సంవత్సరం	ధర రూ.లలో
2010	22,800
2015	32,500
2020	50,250
2025	98,800



నిర్మల్‌ఖిల్లా: అక్షయ తృతీయ పర్వదినం అనగానే ఎంతో కొంత బంగారం కొనుగోలు చేయాలని సంప్రదాయంగా భావిస్తారు. అయితే ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. జిల్లా కేంద్రంలోని బంగారం మార్కెట్లో బుధవారం 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.98,800 ఉండడంతో కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో కొంత బంగారం ఉంటే చాలు.. తర్వాత చూద్దాంలే అన్నట్లుగా ఆలోచిస్తున్నారు.

ఈసారి అంతంతే...

ఏటా అక్షయ తృతీయను పురస్కరించుకొని జిల్లాలోని దుకాణాలు కిటకిటలాడేవి. ఈసారి మాత్రం బంగారం ధర ఏకంగా లక్షకు చేరువ కావడంతో విక్రయాలు అమాంతం పడిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. మరోవైపు స్వర్ణకారులకు కూడా ఉపాధి లేకుండా పోయింది. బంగారం కొనుగోలు లేక నగలు ఆభరణాలు తయారీ కూడా అంతంత మాత్రంగానే సాగుతోందని అంటున్నారు.



నిర్మల్‌లో వెలవెలబోతున్న బంగారం దుకాణం

వ్యాపారం సన్నగిల్లింది..

గతంతో పోల్చితే ఈ ఏడు జనవరి నుంచి బంగారం ధరలు క్రమంగా పెరుగుతూ పోతున్నాయి. ఏప్రిల్ నాటికి 24 క్యారెట్ బంగారం ధర ఏకంగా లక్షకు చేరింది. దీంతో గతంతో పోల్చితే వ్యాపారం, నగల తయారీదారులకు ఉపాధి భారీగా సన్నగిల్లింది. వివాహాది శుభకార్యాలను కూడా అతికొద్ది బంగారం కొనుగోళ్లతోనే కానిచ్చేస్తున్నారు.

భైంసాటౌన్: అక్షయ తృతీయ సందర్భంగా విత్తనాలతో పాటు బంగారం కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా కనిపించింది. అక్షయ తృతీయకు ఇక్కడి రైతులు విత్తనాలు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ధర ఎక్కువగా ఉండడంతో, బంగారం కొనుగోళ్లకు ఆసక్తి చూపలేదు.

కుంటాల: మండలంలోని రైతులు విత్తనాలు, బంగారం కొనుగోలు చేశారు. అందాకూర్, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో స్వాధ్యాయ పరివార్ సభ్యులు పంట చేలలో భూమిపూజ చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

దస్తురాబాద్: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని ఏఎస్పీ రాజేశ్ మీనా సూచించారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన ఏఎస్సై లక్ష్మీనారాయణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ముఖ్యంగా డయల్ 100 కాల్స్‌పై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని వాస్తవ పరిస్థితులను అంచనావేసి తగుచర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఏఎస్సై లక్ష్మీనారాయణ సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ అజయ్, కడెం ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి, ట్రెయినీ ఎస్సై తిరుపతిరెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేక యువకుడి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన శెరె శ్రీకాంత్ (35) మతిస్థిమితం లేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీకాంత్ గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండేవాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు దిలీప్ ఫిర్యాదుతోకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

తానూరు: లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ భైంసా మేజిస్ట్రేట్ దేవేందర్‌బాబు బుధవారం తీర్పునిచ్చారు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం..మండంలలోని వడ్గాం గ్రామానికి చెందిన దిలీప్ 2020 జనవరి 26న అదేగ్రామానికి చెందిన మహిళ ఇంటికి వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజన్న కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో నిందితుడు నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్ ఈమేరకు తీర్పునిచ్చారని ట్రెయినీ ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా (బి)సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, 108 పైలెట్ ఆత్రం ఆశోక్, కృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు జున్నైద్ బైక్‌పై గుడిహత్నూర్ వైపు వెళ్తున్నాడు. దనోరా(బి) సమీపంలో పిట్స్ రావడంతో ఎదురుగా కాలినడకన వస్తున్న గ్రామానికి చెందిన శివరాజ్‌పాటిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివరాజ్ పాటిల్‌తోపాటు జున్నైద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గాదిగూడ తహసీల్దార్ బదిలీ.. ఉద్యోగ విరమణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ తహసీల్దార్ ఎస్.విజయానందం మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్ ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన సొంత జిల్లాలో రిపోర్ట్ చేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కాగా, విజయానందం స్థానంలో డీటీగా పనిచేస్తున్న చౌహాన్ విలాస్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శిక్షలు

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి కె.నిరోష బుధవారం వినూత్న శిక్షలు విధించింది. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఐదుగురికి ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రిని శుభ్రపర్చాల్సిందిగా న్యాయమూర్తి ఈ మేరకు శిక్ష ఖరారు చేశారు. మరో ఏడుగురికి రూ.16 వేల జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ తెలిపారు.

విత్తనపూజకు వేళాయె

- జంగుబాయి సన్నిధిలో ఆదివాసీల పూజలు
- ఆలయంలో రేపటి నుంచి నెలరోజులు ఉత్సవాలు


జంగుబాయి కొలువైంది ఇదే గుహలో


ఆలయంలో కొలువైన పోచమ్మ తల్లులు

కెరమెరి(ఆసిఫాబాద్): అనాదిగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. జూన్ 8న మృగశిరకార్తె ప్రవేశించనుండడంతో ఆదివాసీలు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్ గూడ అడవుల్లో కొలువైన జంగుబాయికి పుణ్యక్షేత్రంలో విత్తన పూజకు శ్రీకారం చుట్టారు. అక్కడి గుహలోకి వెళ్లి దీపం వద్ద పూజలు చేస్తారు. రావుడ్, పోచమ్మ, మైసమ్మకు విత్తనాలు చూపించి మొక్కి అమ్మవార్లకు నైవేద్యం చూపిస్తారు. విత్తన పూజల అనంతరం తమ పొలాల్లో విత్తనాలు నాటడం ప్రారంభిస్తారు. దీన్ని గోండి భాషలో 'మొహతుక్' అంటారు. అదేవిధంగా గిరి గ్రామాల్లో ఏటా జరిగే విత్తన పూజల ముందుగా జంగుబాయి అమ్మవారికి విత్తనాలు చూపెట్టాక పొలాల్లో నాటడంతో అధిక దిగుబడి వస్తాయని భక్తుల నమ్మకం.

నేడు దీపోత్సవం

జంగుబాయి సన్నిధిలో గురువారం దీపోత్సవం, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు నెల రోజుల పాటు నిర్వహిస్తారు. వివిధ గ్రామాలకు చెందిన మోళంలు తరలివచ్చి పూజలు చేస్తాయి. దుక్కిలతో దున్ని విత్తనాలు వేసేందుకు తమ పొలాలను రైతులు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాలోనే ఆదివాసీలు అధికంగా ఉన్నారు.

దేవతలకు విత్తనాలు చూపిస్తారు

మే మాసంలో అన్ని గ్రామాల్లో గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. ఆదివాసీల కులదైవమైన పాటేరు అమ్మోరు, జంగుబాయి, గాంధారి కిల్ల, పద్మాల్‌పురి కాకో వద్దకు వెళ్లి విత్తనాలను చూపిస్తారు. అక్కడే దేవతల ఆశీర్వాదం తీసుకుని తిరుగుపయనమవుతారు. అనంతరం


రాహుడ్ దేవతలు

గ్రామంలో ఉన్న ఆకిపేన్, అమ్మోరు, పోచమ్మ వద్దకు వెళ్లి విత్తనాలతో పూజలు చేస్తారు. అదే రోజు రాత్రి 2.5 కిలోల జొన్నలతో గట్క తయారు చేసి ఆరగిస్తారు. అర్ధరాత్రి అడవికి వెళ్లి (కుమ్మడ్) చెట్టు ఆకులను తీసుకువచ్చి డొప్పలు తయారు చేసి ఇళ్లల్లో ఇస్తారు. అందులో పూజ చేసిన విత్తనాలు వేస్తారు. ఈ కార్యక్రమంతా మృగశిర మాసానికి కొద్ది రోజుల ముందుగా నిర్వహిస్తారు.

విత్తన పూజలు(మొహతుక్)

విత్తన పూజ చేయాలన్న రోజు రైతు కుటుంబమంతా ఉదయాన్నే పొలం బాట పడుతారు. ఉదయం ఇంటిని శుభ్రం చేసి పేడతో అలుకు చల్లుతారు. పొలానికి వెళ్లాక జొన్నతో గట్కా తయారు చేసి కుల దైవంతోపాటు నేల తల్లికి సమర్పిస్తారు. అనంతరం పొలంలో విత్తనాలు చల్లి అరకకు ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటుతారు. గ్రామ పటేల్ ఇంటి ఎదుట మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తారు. పురుషులు గిల్లిదండా ఆట ఆడుతారు. తర్వాత సహపంక్తి భోజనం చేస్తారు.

చంచి భీమల్ దేవుడి కల్యాణంతో..

ఆదివాసీల ఇష్టదైవమైన చంచి భీమల్ దేవుడి కల్యాణం సందర్భంగా ఏటా ఏప్రిల్, మే మాసంలో విత్తనాలను దేవుడికి చూపిస్తారు. ఆరోజు

దేవతలకు చూపించాకే..



పొలాల్లో విత్తనాలు నాటే కొన్నిరోజుల ముందు కుల దేవతలకు వాటిని చూపిస్తాం. ప్రత్యేక పూజలు చేశాకే పొలానికి వెళ్లి జొన్నగట్కాను వండి ఆరగిస్తాం. నేలతల్లికి ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటడం ప్రారంభిస్తాం. – సలాం శ్యాంరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ చైర్మన్

ఆచారాలు పాటిస్తున్నాం



ఆదివాసీలు ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తూ వస్తున్నారు. ఏళ్ల క్రితం నుంచి ప్రారంభమైన విత్తన(మొహతుక్) పూజలు ఇప్పుడు కూడా చేస్తున్నాం. పూజలు చేయందే విత్తనాలు నాటం.– పుర్క బాపూరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ, ప్రచార కార్యదర్శి

ఆదివాసీలు భీమల్ దేవుడికి సంప్రదాయ పూజలు చేస్తారు. అడవుల్లో లభించే ఆకులతో ఆరు డొప్పలను తయారు చేస్తారు. అందులో అన్ని విత్తనాలను కలిపి భీమల్ దేవునికి చూపిస్తారు. అనంతరం వాటిని ఇళ్లకు తీసుకెళ్లి దాచి పెడ్తారు. ఆరోజు పిండి వంటలు చేసి ఆరగిస్తారు. మృగశిర కార్తె ప్రారంభంతో ఆ విత్తనాలను తమ పొలాల్లో చల్లుతారని పలువురు చెబుతున్నారు.

ఉమెన్స్ హ్యాండ్‌బాల్ విజేత ఉమ్మడి ఆదిలాబాద్



కప్ అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

- రన్నరప్‌గా రంగారెడ్డి జట్టు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మూడు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి 54వ సీనియర్ మహిళల తెలంగాణ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజేతగా, రంగారెడ్డి జట్టు రన్నరప్‌గా నిలిచింది. బుధవారం ఫైనల్‌మ్యాచ్‌లో ఈ జట్లు తలపడగా ఆదిలాబాద్ జట్టు 13, రంగారెడ్డి జిల్లా జట్టు 11 గోల్స్ వేసింది. మూడో స్థానంలో వరంగల్, నాలుగో స్థానంలో ఖమ్మం జట్లు నిలిచాయని, గెలిచిన జట్లకు నిర్వాహకులు షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జట్టు కోసం 20 మందిని ఎంపిక చేసి వరంగల్‌లో కోచింగ్ ఇస్తామన్నారు. గుజరాత్‌లోని బూజ్‌లో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ ఉమ్మడి 10 రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ కాంపెల్లి సమ్మయ్య, కోశాధికారి రమేశ్‌రెడ్డి, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జొన్న పంట దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు దాదాపు 10 ఎకరాల జొన్న పంట దగ్ధమైంది. ఎంఆర్‌ఐ నూర్‌సింగ్ కథనం ప్రకారం.. గ్రామంలో మధ్యాహ్నం కొత్తకొండ లక్ష్మీ పంటచేనులో జొన్నపంటకు మంటలు అంటుకున్నాయి. కొన్ని క్షణాల్లో చుట్టుపక్కల చేలకు మంటలు విస్తరించి దాదాపు 10 ఎకరాల జొన్న పంటతోపాటు 100 పైపులు, స్ప్రింక్లర్లు కాలి బూడిదయ్యాయి. ఘటన స్థలాన్ని సీఐ వెంకటేశ్వర్‌రావు, ఆడె గజేందర్, జల్కే పాండురంగ్, నారాయణ పరిశీలించారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాంసిలో రెండెకరాలు..

తాంసి: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నిప్పంటుకుని రెండెకరాల్లో జొన్న పంట దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి..సోమ గంగారెడ్డి పంటచేను పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన


బజార్‌హత్నూర్: దేగామలో కాలిబూడిదైన జొన్న

నిప్పురవ్వలతో మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో రెండెకరాల్లో జొన్న పంట దగ్ధమైంది. స్థానికులు నీళ్లను చల్లి మంటలార్పివేశారు. అగ్ని ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన మరో రైతు సతీశ్ చేనులో అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెంది పదికి పైగా స్ప్రింక్లర్ల పైపులు దగ్ధమయ్యాయి.

గుండెపోటుతో ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

భీమారం: మండల కేంద్రానికి చెందిన రామళ్ల సాగర్ ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందాడు. అతని బంధువులు తెలిపిన వివరాలు.. కొన్నినెలల క్రితం సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన సాగర్ (29) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో భాగంగా కాలికి దెబ్బతగలంతో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలనడంతో గతనెల 26న స్వగ్రామానికి వచ్చాడు. బంధువుల వివాహం ఉండటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి బుధవారం మంచిర్యాలకు వెళ్లాడు. అక్కడ ఒక హోటల్ వద్ద కూర్చున్న సాగర్ అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే గమనించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సాగర్ మృతితో భీమారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


రామళ్ల సాగర్ (ఫైల్)

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందినట్లు ఏఎస్సై మారుతి రాథోడ్ తెలిపారు. అయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన సిడాం నాగోరావు (42) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇసుక లోడ్ తీసుకొని గుండంలొద్ది గ్రామానికి వెళ్లాడు. అన్‌లోడింగ్ చేసి తిరుగుపయనమయ్యాడు. బుధవారం వేకువజామున మార్గమధ్యలో ట్రాక్టర్ బోల్తాపడి గుంతలో పడిపోయింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఏఎస్సై వివరించారు.

మంచిర్యాల సీఈగా సత్య రాజచంద్ర

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇరిగేషన్ శాఖలో ఇద్దరు అధికారులకు ఇన్‌చార్జిలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగ విరమణ చేసి వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించారు. పెద్దపల్లి జిల్లా ఎస్‌ఈగా పనిచేస్తున్న ఎ.సత్య రాజచంద్రను మంచిర్యాల చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. ఆదిలాబాద్ ఇరిగేషన్ సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.లక్ష్మిని నిర్మల్ సర్కిల్ డీఈగా బాధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ పేర్కొన్నారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: చంపేస్తానని బెదిరింపులకు గురిచేసిన ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల క్రితం రాంనగర్ కాలనీకి చెందిన ఖాలీం ఖాన్, అన్వర్‌ల మధ్య గొడవ జరిగింది. దీంతో ఖాలీంఖాన్‌పై గతంలో కేసు నమోదైంది. తనకు రూ.50వేల వరకు ఖర్చయిందని కేసు వెనక్కి తీసుకుంటాను. కానీ ఆ రూ.50వేలు ఇవ్వాలని ఖాలీంఖాన్‌ను అన్వర్ డిమాండ్ చేశాడు. లేకపోతే చంపేస్తానని బెదిరింపులకు గురిచేయడంతో అన్వర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి బలవంతరావుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో తనిఖీలు చేపట్టగా డబ్బులు అప్పుగా ఇచ్చి ఆటోను తాకట్టు పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రామిసరీ నోట్లు లభించినట్లు తెలిపారు. ఆయనకు నోటీసు జారీ చేసినట్లు వివరించారు.

వడ్డీ వ్యాపారం చేస్తున్న మహిళపై..

ఆదిలాబాద్‌రూరల్: వడ్డీ వ్యాపారం చేస్తున్న ఓ మహిళపై బుధవారం కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన దుర్పత బాయి వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వారి ఇంటి వద్ద దాడి చేయగా ఆమె ఇంట్లో వడ్డీ వ్యాపారానికి సంబంధించిన నలుగు పుస్తకాలు లభ్యమయ్యాయి. దీంతో ఆమెపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు మట్కా నిర్వాహకులపై..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన ఇద్దరు మట్కా నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం అన్నదమ్ముళ్లు వసీమ్, నదీమ్‌లు బైక్‌పై తిరుగుతూ మట్కా నిర్వహిస్తున్నారు. బొక్కల్‌గూడ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా, ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తాత్విక ధోరణితో సమున్నత జీవితం

- 'జీవితమే ఒకపుస్తకం' గ్రంథ పరిచయ కార్యక్రమంలో సాహితీవేత్తలు
- జిడ్డు కృష్ణమూర్తి ఆంగ్ల పుస్తకాన్ని అనువదించిన జిల్లా కవి


ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నిర్మల్‌ఖిల్లా: తాత్విక ధోరణి ద్వారానే సమున్నత జీవితం సిద్ధిస్తుందని జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. జిల్లాకేంద్రంలోని కావేరి ఫౌండేషన్ గ్రంథాలయంలో మంగళవారం రాత్రి 'జీవితమే ఒక పుస్తకం'గ్రంథ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అనువాదకర్త కె.మచ్చేందర్..ప్రపంచ తాత్వికవేత్త జిడ్డు కృష్ణమూర్తి ప్రసంగాల సమాహార గ్రంథం 'ది బుక్ ఆఫ్ లైఫ్'అనే ఆంగ్ల పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు కష్టపడి ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించడం ప్రశంసనీయమని కొనియాడారు. కావేరి ఫౌండేషన్ చైర్మన్ అప్పాల చక్రధారి, సాహితీవేత్తలు టి.సంపత్ కుమార్, నరసయ్య, రవీంద్రబాబు, తుమ్మల దేవరావు, కృష్ణంరాజు, మునిమడుగుల రాజారావు, ఆకుల సుదర్శన్, అంబటి నారాయణ, అనిత, నాగరంజని, నూకల విజయ్‌కుమార్, దీపక్, పోలీస్ భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి చరిత్ర కాలగర్భంలోకి..


దేవతమూర్తుల విగ్రహాలు


నాటి రాతి స్తంభాలు

కడెం:మండలంలోని బెల్లాల్ సమీపంలో గోదావరి, కడెం నది కలిసే ప్రాంతంలో 1200 ఏళ్ల క్రితం నాటి మల్లికార్జున స్వామి ఆలయ చరిత్ర కాలగర్భంలోకి కలిసిపోతుంది. ఆలయ గర్భంలో నిధులు, నిక్షేపాలు ఉన్నాయని వందల ఏళ్ల క్రితం ఆలయాన్ని, దేవతమూర్తుల విగ్రహాలను నాడు కొందరు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో స్తంభాలు పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు పెద్దలు చెబుతున్నా రు. పురాతన ఆలయాన్ని పరిరక్షించకపోవడంతో అనాటి చరిత్రాక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. విగ్రహాల తల భాగాలు లేకుండా పోగా, రాతిస్తంభాలు గోదావరి ఒడ్డున కుప్పలుగా ఉన్నా యి. ప్రస్తుతం పురాతన ఆలయం ఉన్నచోట గ్రా మానికి చెందిన వారు నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. 1200 ఏళ్ల క్రితం నాటి చరిత్రని, శివ సాహిత్యం పొందడానికి ఆత్మహుతి చేసుకున్న వీరగల్లు విగ్రహంగా భావిస్తున్నట్లు తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ హరగోపాల్, రాజ్‌కుమార్ తెలిపారు.

నకిలీపత్రాల ఘటనపై ఎస్పీ సీరియస్

- ఉద్యోగాలు పొందిన 17 మంది..
- విచారణ అధికారిగా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్
- కొనసాగుతున్న విచారణ

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఏకంగా 17 మంది ఉద్యోగాలు సాధించిన సంఘటన జిల్లాలో కలకలం రేపుతోంది. బీఎస్‌ఎఫ్‌లో 7, ఐటీబీపీలో 7, ఎస్‌ఎస్‌బీలో 1, సీఆర్పీఎఫ్‌లో 2 ఇద్దరు ఉన్నట్లు తెలుస్తోంది. బీఎస్‌ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించిన ముగ్గురిపై ఇచ్చోడ, ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైన విషయం విదితమే. మరో 14 మంది నకిలీ పత్రాలతో ఉద్యోగాల్లో కొనసాగుతుండటంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఈఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆమె నేతృత్వంలో ఇప్పటికే పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రెండు రోజుల నుంచి మీ సేవ కేంద్రాలను తనిఖీలు చేసి నిర్వాహకులను విచారించారు. గత ఐదునెలల వ్యవధిలో ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రాల కోసం 180 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల యువకుల దరఖాస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిజెక్ట్ చేసిన తిరిగి ఒక్కొక్కరు రెండు, మూడుసార్లు దరఖాస్తులు చేసుకోవడం వెనుక దాగి ఉన్న అసలు రహస్యం అంతు పట్టడం లేదు. ఏది ఏమైన నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసి భద్రత దళాల్లో ఉద్యోగం పొందడంపై జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. స్థానికంగా ఉండేవారి ఆధార్, రేషన్‌కార్డు పత్రాలతో దరఖాస్తు చేయడం, ఈ దిశగా పోలీసుల విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

డీఎంహెచ్‌వోకు బెదిరింపు కాల్

- ఏసీబీ అధికారి అంటూ..
- ఆస్పత్రులను తనిఖీ చేస్తుండగా ఫోన్

ఆదిలాబాద్‌టౌన్: డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌కు మంగళవారం బెదిరింపు కాల్ వచ్చింది. జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ ఏసీబీ ఆఫీస్ నరేందర్ కుమార్ రెడ్డి నుంచి ఫోన్ వచ్చింది. డీఎంహెచ్‌వో తొడసం చందు మాట్లాడుతున్నారా అని అడగగా, కాదు.. తాను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అని చెప్పారు. జిల్లాలో ఎన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారని అడుగగా, 20 ఏళ్ల నుంచి వైద్యసేవలు అందిస్తుండగా, నాలుగేళ్ల నుంచి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, డీఎంహెచ్‌వోపై ఏసీబీ రైడ్ అవుతుందని పేర్కొనగా, తాను ఎవరికి భయపడనని, ఏసీబీ రైడ్ చేసుకొమ్మని తెలిపారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ డీఎంహెచ్‌ఓను ఆరా తీశారు. ఏసీబీ అధికారులు ఎవరూ ఫోన్ చేసి వివరాలు అడగరని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన క్యాంపు కార్యాలయంలో డీడీ అంబాజీ, ఏసీఎంవో జగన్‌ను అభినందించారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి 96 శాతం ఫలితాలు సాధించినట్లు ఏసీఎంవో జగన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 108 పాఠశాలలు, అందులో 65 పాఠశాలలు వంద శాతం వచ్చాయని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదిలో ఉత్తమ ఫలితాలు సాధనకు ఐటీడీఏ పీవో సారథ్యంలో చేపట్టిన మిషన్ లక్ష్యం ఎంతో మేలు చేసిందన్నారు. వచ్చే ఏడాదిలో పదిలో వందశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు.


అభినందిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మూడు కిలోమీటర్లు వెళ్తేనే నీరు



ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ పంచాయతీ పరిధిలోని సాలేగూడలో నీటి కోసం గ్రామస్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామశివారులో వ్యవసాయ బోరు బావుల నుంచి, ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం బోరుబావులు అడుగంటడంతో నీళ్లు రావడం లేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో సిరికొండ మండలం రాంపూర్‌కు బైక్‌లు, ఎడ్లబండ్లపై నీటిని తెచ్చుకుంటున్నారు. కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి